# వంద ఫీట్ల రహదారులపై హైడ్రామా

- పొలాలకు వెళ్లేందుకే విశాల రహదారుల నిర్మాణమట
- రైతులు కోరితేనే నిర్మాణ సంస్థ పనులు చేపట్టిందట
- పొలాలకు వెళ్లేందుకు వంద ఫీట్ల రోడ్డుందుకు?
- ప్రశ్నించిన ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీత
- రెండు రోజుల్లో పీవోటీ కింద స్వాధీనం

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): దశాబ్దాలుగా ఆ రెండు గ్రామాల సరిహద్దుల్లో ఉన్న భూములకు రైతులు వెళుతున్నారు. గుట్టలుపోను... చదును ఉన్న చోట సాధ్యమైనంత వ్యవసాయం చేస్తున్నారు. డొంక మార్గమో... రైతులు సమిష్టిగా వదులుకున్న దారో... నిన్నటిదాకా వాళ్లకు ఎలాంటి ఇబ్బంది కలగలేదు. కానీ పొలాలకు వెళ్లేందుకు అకస్మాత్తుగా వాళ్లకు వంద ఫీట్ల రహదారి కావాలని కోరిక పుట్టింది. వెంటనే ఒక నిర్మాణ సంస్థను ఆశ్రయించారు. వారు రైతుల కోరిక మేరకు వాళ్ల భూముల్లోనే వంద ఫీట్ల విశాలమైన రహదారులు నిర్మిస్తున్నారు. మరి.. ఇంతకీ ఆ రైతులు తమకున్న అర ఎకరమో, ఒకటో, రెండో ఎకరాలను రహదారి నిర్మాణానికి ఇస్తే ఇంకా వాళ్లకు భూములెక్కడివి? భూములే నిర్మాణంలో పోయిన తర్వాత రహదారి ఎందుకు?? రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం -అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల సరిహద్దున 'అసైన్డ్ భూముల్లో వెంచర్' వ్యవహారంలో తాజాగా తెరపైకి వచ్చిన హైడ్రామా ఇది. అసైన్డ్ భూముల నుంచి దర్జాగా రోడ్ల నిర్మాణం చేపడుతున్న వైనంపై 'నమస్తే తెలంగాణ'లో కథనం రావడంతో కొందరు రైతులు తెర మీదకొచ్చారు. తమ భూముల్లోకి వెళ్లేందుకు రోడ్డు కావాలని ఒక నిర్మాణ సంస్థను కోరితే వాళ్లు వంద ఫీట్ల రోడ్డు వేస్తున్నారే తప్ప తమ భూములు ఎవరూ ఆక్రమించలేదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇతరులు వాళ్ల పొలాలకు వెళ్లేందుకు రైతులు తమ భూములను త్యాగం చేయడం... అందునా ఒక నిర్మాణ సంస్థ ఎలాంటి లాభాపేక్ష లేకుండా రోడ్డు నిర్మాణం చేపట్టడం బహుశా చరిత్రలో ఇక్కడే జరిగింది కాబోలు.

### ఆ నిర్మాణాలు ఎందుకో?

వాస్తవానికి ఇబ్రహీంపట్నం మండలంలోని నాగన్‌పల్లి గ్రామ సరిహద్దున ఉన్న సర్వేనంబరు 189లోని అసైన్డ్ భూముల మీదుగానే ఇబ్రహీంపట్నం మండలంలోని అనాజ్‌పూర్ గ్రామ పరిధిలోని భూముల్లోకి వెళ్లాల్సి ఉంటుంది. గతంలో ఇలా వెళ్లేందుకు అనేక మార్గాలు ఉన్నాయి. ఇప్పుడు తాము రహదారి నిర్మాణం కోసం భూములు ఇచ్చామని నాగన్‌పల్లికి చెందిన కొందరు రైతులు మంగళవారం మీడియా ముందు చెప్పగా... అందులో ఉన్న వారికి గరిష్ఠంగా రెండు, రెండున్నర ఎకరాల భూమి మాత్రమే ఉంది. మరి రహదారి నిర్మాణం కోసం ఉన్న భూమి ఇస్తే వాళ్లు పోయేది ఎవరి భూముల్లోకి? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఈ రహదారి నిర్మాణం దాటిన తర్వాత నాగన్‌పల్లికి చెందిన భూములు లేవు. అవన్నీ అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన భూములు. దీంతో తమ భూముల్లోకి వెళ్లేందుకే రోడ్డు నిర్మాణమని చెబుతున్న రైతుల మాటల్లో వాస్తవం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. కాగా సదరు నిర్మాణ సంస్థ రోడ్డు నిర్మాణంతోపాటు సెక్యూరిటీ వారి కోసమో, ఇతర కార్యాలయ అవసరాల నిమిత్తమో... గదుల నిర్మాణాన్ని కూడా చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో రోడ్డు పొలాలకు వెళ్లేందుకైతే మరి ఈ గదుల నిర్మాణం ఎందుకోసమో మాత్రం అటు రైతులు, ఇటు నిర్మాణ సంస్థ మాత్రం వెల్లడించకపోవడం గమనార్హం.

## పీవోటీ కింద తీసుకుంటాం: తహసీల్దార్


ప్రభుత్వం పంపిణీ చేసిన అసైన్డ్ భూములను నిర్మాణ సంస్థకు లీజు ప్రాతిపదికన ఇవ్వడంతో పాటు అందులో రహదారుల నిర్మాణం చేపడుతుండటంతో ఇబ్రహీంపట్నం రెవెన్యూ అధికారులు నాగన్‌పల్లి గ్రామ రైతులకు గతంలోనే నోటీసులు జారీ చేశారు. పీవోటీ కింద ఆ భూములను తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని అందులో పేర్కొన్నట్టు తెలిసింది. ఒకవైపు యథేచ్ఛగా రోడ్ల నిర్మాణం చేపడుతున్నా పనులను నిలువరించని అధికారులు నోటీసుల గడువు పూర్తి కాగానే పీవోటీ కింద భూములను స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేస్తున్నారు. నిర్మాణ సంస్థ ద్వారా తమ భూముల్లో రోడ్లు వేయిస్తున్నామని నాగన్‌పల్లికి చెందని కొందరు రైతులు మంగళవారం ప్రకటించిన విషయం ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీత దృష్టికి తీసుకువెళ్లగా... పొలాలకు వెళ్లేందుకు వంద పీట్ల రోడ్లు ఎందుకు? అని ప్రశ్నించారు. ఎలాంటి నిర్మాణం చేపట్టాలన్నా ప్రభుత్వ అనుమతి ఉండాలని, అలాంటి అనుమతి ఆ రోడ్లకు లేదని చెప్పారు. అసైన్డ్ భూముల్లో నిర్మాణాలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వదని ఆమె కుండబద్దలు కొట్టారు. కాగా ఈ నెల 7వ తేదీన అధికారులు రైతులకు నోటీసులు ఇచ్చిన దరిమిలా గడువు ఈ నెల 22తో ముగియనుంది.



నాగన్‌పల్లిలోని సర్వే నంబర్ 189లో గల ప్రభుత్వ భూమిలో నుంచి అక్రమంగా వెంచర్‌లోకి వేసిన రోడ్డు

# ఇందిరాసాగర్ చెరువుకు ఉరి!






ఇందిరాసాగర్ చెరువు వద్ద ముమ్మరంగా సాగుతున్న పనులు పక్కన ఇందిరా సాగర్ చెరువు మ్యాప్

మొదటిపేజీ తరువాయి...

శాపంగా మారాయి. భారీ యంత్రాలతో గుట్టలన్నింటినీ పిండి చేస్తున్న రియల్టర్లు మట్టి, రాళ్లను అందులోకి జార విడుస్తుండటంతో మున్ముందు వరద వచ్చే మార్గమే మూసుకుపోయే ప్రమాదముందనే ఆందోళన వ్యక్తమవుతుంది. ఇదీ... రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం-అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల సరిహద్దున 'అసైన్డ్ భూముల్లో వెంచర్' వ్యవహారంలో కొత్త కోణం. హైడ్రా పరిధిలోనే ఇదంతా జరుగుతున్నా... సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడకపోవడంతో బహిరంగంగానే ఇందిరాసాగర్‌కు ఉరితాడు బిగుసుకుంటుంది.

### 512 ఎకరాల ఆయకట్టు

రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని నాగన్‌పల్లి.. అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని అనాజ్‌పూర్ గ్రామాల సరిహద్దుల్లో ఓ భారీ వెంచర్ రూపు దిద్దుకుంటుందనేది బహిరంగమే. సుమారు 250-300 ఎకరాల (ఇతరుల భూములు కలుపుకున్నా) విస్తీర్ణంలో ఉన్న పట్టా భూముల ఆధారంగా దీనిని ఏర్పాటు చేస్తున్నారు. వాస్తవానికి ఈ భూముల్లోకి రావాలంటే గ్రామాల్లో పూర్వం నుంచి ఉండే చిన్న చిన్న డొంకలు, దారులు ఉన్నాయి. కానీ ఆ భూమిని పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్న దరిమిలా విశాల రహదారులు నిర్మిస్తున్నారు. ఇందుకోసం నాగన్‌పల్లి పరిధిలోని అసైన్డ్ భూములను లీజు ప్రాతిపదికన తీసుకొని అందులో వంద ఫీట్ల రహదారులు, ఇతర నిర్మాణాలు చేపడుతున్నారు. రెవెన్యూ శాఖ నోటీసులు జారీ చేసినా పనులు మాత్రం ఆగడం లేదు. ఈ నేపథ్యంలో 'నమస్తే తెలంగాణ' ఆ పనులు మరింత లోతుగా పరిశీలించినపుడు ఇందిరాసాగర్‌కు వాటిల్లుతున్న ముప్పు బయటపడింది. 1981లో రంగారెడ్డి జిల్లా ఏర్పడగా.. అంతకు ఏడాది ముందే ఇందిరాసాగర్ నిర్మాణం పూర్తయింది. మూడు గ్రామాల పరిధిలో 512 ఎకరాల ఆయకట్టుకు ఈ చెరువు ద్వారా సాగునీరు అందుతుంది. దీంతో పాటు చుట్టుపక్కల గ్రామాల పరిధిలో భూగర్భజలాలూ పెరగడంతో తాగునీరు అందుతుంది. ఈ చెరువుకు సుదూర ప్రాంతం నుంచి గొలుసుకట్టు ద్వారా వరద నీరు రావడం విశేషం. మహేశ్వరం మండలంలోని రావిర్యాల పెద్ద చెరువు నుంచి ప్రారంభమయ్యే పులిందర్‌వాగు క్రమంగా దిగువన ఉన్న మంగళపల్లి వద్ద చెక్‌డ్యాం.. ఆపై శేరిగూడ వద్ద మరో చెక్‌డ్యాం మీదుగా తట్టిఖాన వద్ద వాగులోని చెక్‌డ్యాంను దాటి ఇందిరాసాగర్‌కు చేరుకుంటుంది. ఇలా సుమారు వంద ఫీట్ల కాల్వ (వాగు) మార్గం ద్వారా భారీ ఎత్తున వరద వస్తుంది. ఇందిరాసాగర్ నుంచి దిగువన అనాజ్‌పూర్ చెరువుకు వరద చేరుకుని... అది మత్తడి దుంకితే దిగువన ఉన్న మూసీలోకి నీరు చేరుతుంది. ఈ క్రమంలో 2015లో కేసీఆర్ ప్రభుత్వం మిషన్ కాకతీయ కింద రూ.61 లక్షలతో ఇందిరాసాగర్ అభివృద్ధి, మరమ్మతు పనులను కూడా చేపట్టడంతో అదో పర్యాటక ప్రాంతంగా మారింది.

## 'రియల్' పనులతో ముప్పు...

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ గ్రామ పరిధిలోని సర్వేనెంబర్లు 261, 260-281 వరకు 586 ఎకరాల భూములు ఉన్నాయి. ఇందులో పలు సంస్థలకు చెందిన పట్టా భూములతో పాటు ప్రభుత్వం రైతులకు పంపిణీ చేసిన సీలింగ్ పట్టా భూములు కూడా ఉన్నాయి. ఇందులో ప్రధానంగా 279, 280, 281 సర్వేనెంబర్ల మీదుగానే నాగన్‌పల్లి నుంచి దిగువన ఉన్న అనాజ్‌పూర్ పరిధిలోని ఇందిరాసాగర్‌కు వరద నీరు వెళ్లే మార్గం ఉంది. ఇది సుమారు వంద ఫీట్ల మేర వెడల్పుతో ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో కేవలం ఈ మార్గమే 18.12 ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది. నిబంధనల ప్రకారం బఫర్ జోన్ కూడా ఉంటుంది. అయితే పక్కనే ఉన్న భూములను అభివృద్ధి చేయడంలో భాగంగా గుట్టలన్నింటినీ భారీ యంత్రాలతో చదును చేస్తున్నారు. ఈ క్రమంలో పెద్ద పెద్ద బండరాళ్లు, భారీ ఎత్తున మట్టిని బఫర్‌జోన్, వరద వెళ్లే మార్గంలో పోస్తున్నారు. ఈ పనులు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయి. మున్ముందు ఇంకా అనేక గుట్టలను తవ్వాల్సి ఉండటంతో ఇందిరాసాగర్‌కు ప్రమాదఘంటికలు మోగుతున్నాయి. ఈ మార్గం మూసుకుపోతే వందల ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారడంతో పాటు భూగర్భజలాలకూ నష్టం వాటిల్లుతుంది. దిగువన ఉన్న అనాజ్‌పూర్ చెరువుకు కూడా వరద నీరు వచ్చే మార్గముండదు. వాస్తవానికి నీటిపారుదల శాఖ అధికారులు ఇప్పటికే స్పందించి ఇందిరాసాగర్, వరద నీరు వచ్చే మార్గం, బఫర్‌జోన్ పరిరక్షణకు చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ ఎవరూ అటువైపు కన్నెత్తి చూడటం లేదు. కాగా అనాజ్‌పూర్ గ్రామ పరిధిలోని పలు సర్వేనెంబర్ల పరిధిలో 586 ఎకరాలు ఉండగా... అందులో సుమారు 146.35 ఎకరాల మేర సీలింగ్ భూములు ఉన్నాయి. అయితే ఇదంతా ఒకేచోట లేదు. పలు సర్వేనెంబర్లలో కొంత, కొంత ఉంది. ఈ నేపథ్యంలో పట్టా భూముల అభివృద్ధిలో భాగంగా సీలింగ్ భూములు ఉన్న గుట్టలను కూడా చదును చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## కోర్టుకు వ్యవసాయ బదిలీల వివాదం

హైదరాబాద్, ఆగస్టు 13(నమస్తే తెలంగాణ): వ్యవసాయ శాఖలో బదిలీల వివాదం కోర్టుకు చేరింది. బదిలీల్లో తమకు అన్యాయం జరుగుతున్నదంటూ కొంతమంది అధికారులు కోర్టును ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికే 42 మంది ఉద్యోగులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసినట్టు తెలిసింది. సీనియార్టీ జాబితా తప్పుల తడకగా ఉందంటూ కొందరు, బదిలీకి అవకాశం ఉన్నప్పటికీ బదిలీ చేయడం లేదంటూ మరికొందరు ఇలా ఒక్కొక్కరూ ఒక్కో కారణంతో కోర్టును ఆశ్రయిస్తున్నారు. ఇందుకు తగ్గట్టుగానే వ్యవసాయ శాఖలో బదిలీల గందరగోళం కొనసాగుతూనే ఉన్నది. బదిలీల ప్రక్రియ ప్రారంభమై 40 రోజులు గడుస్తున్నప్పటికీ నేటికి పూర్తి కాలేదు. దీంతో ఉద్యోగుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

## ఫీజుల నియంత్రణకు తీసుకున్న చర్యలేమిటి?

- సమగ్రంగా కౌంటర్లు దాఖలు చేయండి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ వ్యవహారంపై సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీచేసింది. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు 1994 లో జారీచేసిన జీవో-1, 2023లో జారీచేసిన ప్రొసీడింగ్స్ అమలు గురించి తెలపాలని కోరింది. ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం, ఐసీడీఎస్ పథకం అమలుపై కూడా పూర్తి వివరాలు నివేదించాలని ఆదేశించింది. జీవో 1 అమలుపై హైదరాబాద్‌కు చెందిన కే అఖిల్‌శ్రీ గురుతేజ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాదే, జస్టిస్ శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. ప్రతివాదులైన కేంద్ర, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖలు, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, జిల్లా విద్యాశాఖాధికారులు, ఆహార భద్రతా కమిషనర్ తదితరులకు నోటీసులు ఇచ్చింది. విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

# అసిస్టెంట్‌కు ఎర.. చిక్కిన సొర

మొదటిపేజీ తరువాయి...

నుంచి సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రెడ్డి రంగారెడ్డి అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి ఫోన్ చేశాడు. 'సార్ మనం అనుకున్న డబ్బులు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పుడే లెక్కించా. రూ.8 లక్షలు బరాబర్ ఉన్నాయి. ఇప్పుడేం చేయాలి?' అని అడిగాడు. మరి కొన్ని గంటల్లో ఆ నోట్ల కట్టలు ఇంటికి వస్తాయంటూ సంబురపడ్డ అదనపు కలెక్టర్.. పెద్ద అంబర్‌పేట ఓఆర్ఓర్ వద్దకు ఆ డబ్బులను తీసుకొని రా అని హుకుం జారీచేశాడు. అదే రోజు సమయం రాత్రి 10:41 గంటలు. ఏసీబీ టీంతో మదన్‌మోహన్‌రెడ్డి అక్కడికి చేరుకున్నాడు. లొకేషన్‌కు వచ్చానని ఫోన్‌చేశాడు. ఈలోపు ఏసీబీ టీం కొంత దూరాన మాటువేసింది. తీరా భూపాల్‌రెడ్డి రానే వచ్చారు. మదన్‌మోహన్‌రెడ్డి నుంచి డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వెంటనే పట్టుకున్నారు. దీంతో అదనపు కలెక్టర్ బండారం మొత్తం బయటపడింది.

నిషేధిత జాబితాలోని భూమిని తొలగించేందుకు రూ.8 లక్షలు డిమాండ్ చేసి రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి ఏసీబీకి అడ్డంగా దొరికిపోయారు. రంగారెడ్డి జిల్లా గుర్రంగూడకు చెందిన జక్కిడి ముత్యంరెడ్డికి సంబంధించిన 14 గుంటల భూమి నిషేధిత జాబితాలో చేరింది. ఆ భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలంటూ తహసీల్దార్‌కు అర్జీ పెట్టుకున్నారు. తహసీల్దార్ పరిశీలన తర్వాత ఆర్డీవో ఆమోదం పొందాక.. సదరు ఫైలు గత జూన్ 26న రంగారెడ్డి జిల్లా అదనపు(రెవెన్యూ) కలెక్టర్ భూపాల్‌రెడ్డి పరిశీలనకు వచ్చింది. నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు అదనపు కలెక్టర్ రూ.8 లక్షలు అడుగుతున్నారని.. ఈ-సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రెడ్డి లంచం డిమాండ్ చేశారు. ఒక్క పైసా తగ్గినా పనికాదని కరాఖండీగా చెప్పటంతో బాధితుడు వారం క్రితం ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. దీంతో ఆ అవినీతి అధికారులను పట్టుకొనేందుకు ఏసీబీ పక్కా స్కెచ్ వేసింది. వల వేసి అదనపు (రెవెన్యూ) కలెక్టర్ భూపాల్‌రెడ్డి, ఈ-సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రెడ్డిని పట్టుకున్నారు. ఇద్దరినీ అరెస్టు చేసి ఏసీబీ కోర్టుకు తరలించారు.



అసిస్టెంట్ కలెక్టర్ భూపాల్‌రెడ్డిని అదుపులోకి తీసుకుంటున్న ఏసీబీ

### రాత్రంతా హైడ్రామా

పెద్ద అంబర్‌పేట్ ఓఆర్‌ఆర్ వద్ద రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నాక వారిద్దరిని అదే రాత్రి కొంగరకలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు ఏసీబీ అధికారులు తరలించారు. రాత్రంతా కార్యాలయంలోనే ఉంచి సోదాలు నిర్వహించారు. పలు రికార్డులను పరిశీలించారు. ఆ తర్వాత మంగళవారం తెల్లవారుజామున నాగోల్‌లోని భూపాల్‌రెడ్డి ఇంట్లోనూ సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.16 లక్షల నగదుతోపాటు పలు కీలకపత్రాలను స్వాధీనం చేసుకున్నారు. కార్యాలయ పనివేళలో కలెక్టరేట్‌లో మరోసారి సోదాలు నిర్వహించారు. సోదాలు జరుగుతున్నంతసేపు కలెక్టరేట్ దరిదాపుల్లోకి జిల్లా స్థాయి అధికారులెవరూ రాలేదు.

### 14 రోజుల రిమాండ్

నాంపల్లి కోర్టులు: అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రెడ్డిని ఏసీబీ అధికారులు మంగళవారం నాంపల్లి ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టగా.. ధరణి వెబ్‌సైట్‌లో ప్రొహిబిటెడ్ లిస్ట్ నుంచి 14 గుంటల భూమిని తొలగించాలని కోరడంతో ఈ పని కోసం జాయింట్ కలెక్టర్ ఆదేశానుసారం తాను రూ.8 లక్షలు డిమాండ్ చేశానని సీనియర్ అసిస్టెంట్ వెల్లడించారు. కోర్టు వారిద్దరికి 14 రోజుల రిమాండ్ విధించింది. నిందితులను చంచల్‌గూడ జైలుకు తరలించారు.

## జీఎస్టీ అధికారులపై కేసు

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ) : నగరంలో ఉన్న జీఎస్టీ కమిషనరేట్‌లో లంచం ఆరోపణలపై ఇద్దరు అధికారులపై సీబీఐ కేసు నమోదు చేసింది. జీఎస్టీ డిపార్టుమెంట్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు ఒక పని విషయంలో రూ.5 లక్షల లంచం ఇవ్వాలని డిమాండ్ చేసినట్టు బాధితుడు సీబీఐకి ఫిర్యాదులో చేశాడు. ఈ మేరకు హైదరాబాద్‌లోని రెండు చోట్ల సీబీఐ సోదాలు నిర్వహించగా నేరారోపణ పత్రాలు లభించాయి.

# కాంగ్రెస్‌లో 'యూత్' రగడ!

- రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి ఎంపికలో వర్గపోరు
- రెండు వర్గాల నేతల నడుమ తీవ్ర పోటాపోటీ
- రంగంలోకి కాంగ్రెస్ సీనియర్ నేతల వారసులు

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌లో మరో కొత్త రగడ మొదలైంది. యూత్ కాంగ్రెస్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడి నియామకానికి పోటాపోటీ రాజకీయం నడుస్తున్నది. రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉండటంతో ఆ పోస్టుకు ప్రాధాన్యం పెరిగింది. ఇటు రాష్ట్ర స్థాయిలో, అటు జిల్లా స్థాయిలో నేతలను పార్టీ నేతలు రెండు వర్గాలుగా చీల్చినట్టు చర్చ జరుగుతున్నది. గతంలో రాష్ట్ర స్థాయి నేతల నిర్ణయంతో అధ్యక్షుల ఎంపిక పూర్తికాగా ఇప్పుడు పలువురు నేతలు ఏకంగా ఢిల్లీ స్థాయిలో పైరవీలు చేస్తున్నట్టు ప్రచారం. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి ఇటీవల శాట్ చైర్మన్‌గా నియమితులయ్యారు. దీంతో తన అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. దీంతో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి ఎంపికకు కాంగ్రెస్ చర్యలు చేపట్టింది. యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ బంధువు పొన్నం తరుణ్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి కూతురు ఆంక్షారెడ్డి, ఎల్బీనగర్ కాంగ్రెస్ నేత జక్కిడి ప్రభాకర్‌రెడ్డి కుమారుడు శివచరణ్‌రెడ్డి తదితరులు పోటీలో నిలిచారు. వీరితోపాటు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, సామ్రాట్ వంశీ, దీపక్ ప్రగ్య కూడా పోటీ పడుతున్నారు. ఈ పదవికి పలువురు సీనియర్ నేతల వారసులు, అనుయాయులు రంగంలోకి దిగడంతో తీవ్ర పోటీ నెలకొన్నది. ఎవరికి వారు తమ అనుయాయులను అధ్యక్షుడిగా చేసేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేస్తున్నారు. ఇందులో భాగంగానే సీనియర్ నేతలు కూడా రెండుగా చీలినట్టు తెలిసింది. జిల్లాల్లో అయితే ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య ఈ అంశం చిచ్చుపెట్టినట్టు తెలుస్తున్నది. కీలక నేతల మధ్య కూడా వైరం నడుస్తున్నది. పీసీసీకి త్వరలోనే కొత్త అధ్యక్షుడిని కాంగ్రెస్ అధిష్టానం నియమించనున్నది. ఈ నేపథ్యంలో వచ్చే కొత్త అధ్యక్షుడు వారికి నచ్చిన వారిని యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమిస్తారనే ప్రచారమూ జరుగుతున్నది.

## తెలంగాణ ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడిగా వెంకటస్వామి

తెలంగాణ రాష్ట్ర ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడిగా యడవెల్లి వెంకటస్వామిని ఆలిండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) నియమించింది. మరో ఎనిమిది రాష్ట్రాలలో కూడా ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షులను నియమించింది. ఈ మేరకు మంగళవారం ఏఐసీసీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఓ ప్రకటన విడుదల చేశారు. బీహార్‌కు జయశంకర్‌ప్రసాద్, చండీగఢ్‌కు సికిందర్ బూర, ఢిల్లీకి అశిష్ లంబా, హిమాచల్‌ప్రదేశ్‌కు అభినందన్ ఠాకూర్, జార్ఖండ్‌కు బినయ్ ఓరాన్, మణిపూర్‌కు జాయ్‌సన్ కేహెచ్, ఒడిశాకు ఉదిత్‌నారాయన్ ప్రధాన్, పశ్చిమబెంగాల్‌కు ప్రియాంక చౌదరీని నియమించారు.

## కొత్త పంచాయతీలు 223

- 12,991కి చేరిన పంచాయతీలు

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొత్తగా 223 గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొత్తగా 223 గ్రామ పంచాయతీలను చేయాలని ప్రతిపాదిస్తూ అసెంబ్లీ, మండలి బిల్లును ఆమోదించాయి. ఆ బిల్లును అప్పటి గవర్నర్ తమిళిసై పెండింగ్‌లో పెట్టారు. గత గవర్నర్ ఆమోదం తెలపడంతో కొత్త పంచాయతీలపై ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పంచాయతీల ప్రకారం జీపీల్లో ఎన్నికలు జరగనున్నాయి. కొత్త పంచాయతీల స మాచారాన్ని పంచాయతీరాజ్‌శాఖ అధికారులు జిల్లాలకు చేరవేశారు. ఇప్పటి వరకు 12,769 గ్రామ పంచాయతీలుండగా కొత్తగా 223 పంచాయతీలను ఏర్పాటు చేశారు. మొత్తంగా 12,992 పంచాయతీలకు చేరాయి. వీటిలో ములుగు జిల్లా కేంద్రాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గ్రామాల సంఖ్య 12,991కు చేరింది.

## రాజగోపాల్‌రెడ్డిని మంత్రి అనే అనుకోండి

- ఆర్టీసీ అధికారులతో మంత్రి పొన్నం
- అన్న అంటే నేను మంత్రినే: రాజగోపాల్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 13(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎవరికివారే మంత్రి అన్నట్టుగా పరిస్థితి తయారైంది. చివరకు అసలు మంత్రులు కూడా ఇతర ఎమ్మెల్యేలను వీరిని మంత్రులుగా భావించండి అంటూ అధికారులతో చెప్తున్న పరిస్థితి కనిపిస్తున్నది. మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మధ్య ఆర్టీసీ అధికారుల సమక్షంలో సాగిన ఎపిసోడ్ ఇందుకు తాజా ఉదాహరణ. రాజగోపాల్‌రెడ్డి రెండు రోజుల క్రితం తన నియోజకవర్గంలో ఆర్టీసీ బస్సుల సమస్యపై మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి చెప్పిన అంశాలను పరిష్కరించాలని అధికారులకు సూచిస్తూ, 'రాజగోపాల్‌రెడ్డిని మంత్రి అని అనుకొనే పని చేయండి..' అని పొన్నం వ్యాఖ్యానించారు. దీనిపై రాజగోపాల్‌రెడ్డి స్పందిస్తూ.. 'నన్ను అన్న మంత్రి అన్నడంటే.. నేను మంత్రినే' అని చెప్పారు. దీంతో అక్కడ రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవిపై చర్చ జరిగింది. త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణలో తనకు మంత్రి పదవి వస్తుందనేది రాజగోపాల్‌రెడ్డి ఆశ.

## ఆస్తి కోసం తండ్రిపై కూతురి దాడి

- భర్త, మరికొందరితో కలిసి కాళ్లు విరగ్గొట్టిన తనయ

*కృష్ణ కాలనీ, ఆగస్టు13: ఆస్తి కోసం కన్న తండ్రిపైనే దాడి చేసి కాళ్లు విరగ్గొట్టింది ఓ కూతురు. ఈ ఘటన మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కారల్‌మార్క్స్ కాలనీలో వెలుగుచూసింది. సింగరేణి విశ్రాంత కార్మికుడు వేల్పుల మల్లేశ్.. లక్ష్మారెడ్డిని దత్తత తీసుకొని తన చిన్న కూతురు మహేశ్వరితో వివాహం చేశాడు. దీంతో మల్లేశ్ మొత్తం ఆస్తిని కూతురు, అల్లుడు తీసుకున్నారు. కొన్ని ఫిక్స్‌డ్ బాండ్లు, 2 గుంటల భూమి మాత్రమే మల్లేశ్ వద్ద ఉండగా.. అవి కూడా తమకే ఇవ్వాలని, లేదంటే చంపుతామని కొంతకాలంగా బెదిరిస్తున్నారు. సోమవారం సాయంత్రం కూతురు, అల్లుడితోపాటు మరో నలుగురు వచ్చి మల్లేశ్‌ను కదలకుండా పట్టుకొని రెండు కాళ్లు విరిగేలా తీవ్రంగా కొట్టారు. లేవలేని స్థితిలో ఉండటంతో జిల్లా కేంద్రంలోని 100 పడకల దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ తమ నాన్న మెట్ల మీదికి వెళ్లి అడ్డం పడ్డాడని కూతురు చెప్పగా.. పరీక్షించిన వైద్యులు మల్లేశ్‌కు రెండు కాళ్లు విరిగాయని, ఎవరో తీవ్రంగా కొట్టడంతోనే ఇలా జరిగిందని చెప్పడంతో అక్కడి నుంచి జారుకుంది. భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌లో మల్లేశ్ ఫిర్యాదు చేయడంతో కూతురు మహేశ్వరి, అల్లుడు లక్ష్మారెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు సీఐ నరేశ్‌కుమార్ తెలిపారు.*



భూపాలపల్లి దవాఖానలో చికిత్స పొందుతున్న వేల్పుల మల్లేశ్

## ఒత్తిడితెచ్చి నమోదుచేసే అభియోగాలు చెల్లవు

- అప్రూవర్లు, సాక్షుల వాంగ్మూలాల వీడియోలు ఇవ్వండి
- ఎమ్మెల్సీ కవిత కేసులో న్యాయవాది వాదనలు

హైదరాబాద్, ఆగస్టు 13 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం విధానం కేసుకు సంబంధించి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నిర్దోషి అని ఆమె తరపు న్యాయవాది మోహిత్‌రావు వాదించారు. మంగళవారమిక్కడ రౌస్ ఎవెన్యూ సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం ఎదుట కవితను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుపరిచారు.

ఈ సందర్భంగా కవిత కస్టడీ పొడిగింపుపై వాదనలు జరిగాయి. కవిత తరపు న్యాయవాది మోహిత్‌రావు తన వాదనలు వినిపిస్తూ.. అప్రూవర్లు, సాక్షులు ఇచ్చిన వాంగ్మూలాన్ని పరిగణనలోకి తీసుకొని కవితపై సీబీఐ, ఈడీలు కేసులు నమోదు చేశాయని చెప్పారు. సెక్షన్ 50 పీఎంఎల్ఏ కింద సాక్షులపై ఒత్తిడి తెచ్చి తప్పుడు వాంగ్మూలాలను నమోదు చేశారని ఆరోపించారు. సాక్షులు, అప్రూవర్ల వాంగ్మూలాన్ని నమోదు చేసే సమయంలో చిత్రీకరించిన వీడియో, ఆడియోలను ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరారు. శరత్ చంద్రారెడ్డి ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా కవితపై ఈడీ ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. శరత్ చంద్రారెడ్డితో కవితకు ఆర్థిక లావాదేవీలు జరిగాయని ఈడీ ఆరోపిస్తున్నదని, వారిద్దరికీ అనేక సంవత్సరాలుగా పరిచయం ఉన్నదని, ఆమెతో ఆర్థిక లావాదేవీలు కూడా ఉన్నాయని మోహిత్‌రావు చెప్పారు. ఆర్థిక లావాదేవీలన్నీ బ్యాంకు ద్వారానే జరిగాయని, దీంట్లో గోప్యత ఏమీ లేదని తెలిపారు. వాదనలు విన్న న్యాయస్థానం తదుపరి విచారణను సెప్టెంబర్ రెండో తేదీకి వాయిదా వేసింది.